సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 14 । సెప్టెంబర్ । 2025



బియ్యం ధరల మోత
బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయి. ఆగస్టు మొదటి వారం నుంచి ఏకంగా క్వింటాల్‌కు రూ.1,000 ధర పెరిగింది.
8లో ▸



ఉచితం.. అవస్థల ప్రయాణం!
చాలీచాలని బస్సులు, బస్టాండ్‌లో గంటల తరబడి పడిగాపులతో ద్వారకాతిరుమలలో శ్రీవారి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.
8లో ▸

అలరించిన నాట్య విన్యాసాలు


ఏలూరులో 12వ జాతీయ స్థాయి నృత్య అవార్డుల ప్రదాన కార్యక్రమం వైభవంగా జరిగింది. చిన్నారులు నాట్య విన్యాసాలతో ఆకట్టుకున్నారు.
8లో ▸



పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు తగవు


రాజ్యాంగం కల్పించిన హక్కుల్లో పత్రికా స్వేచ్ఛ ఒకటి. పత్రికా స్వేచ్ఛను హరించేలా, జర్నలిస్టుల విధి నిర్వహణను అడ్డుకునేలా ఎవరైనా ప్రయత్నించడం సరికాదు. పత్రికలపై గతంలో ఎన్నడూ లేనివిధంగా కూటమి ప్రభుత్వ పాలనలో బెదిరింపు ధోరణి కొనసాగుతోంది. మీడియాపై అక్రమ కేసులు బనాయించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. దీనిపై చట్టసంస్థలు, ప్రజాసంఘాలు, మేధావులు అందరూ స్పందించాలి.

– కొఠారు అబ్బయ్యచౌదరి, దెందులూరు మాజీ ఎమ్మెల్యే

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే..


ప్రజాస్వామ్యంలో మీడియా అనేది నాలుగో స్తంభం లాంటిది. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా ఉంటుంది. ప్రభుత్వ వైఫల్యాల్ని ఎత్తి చూపే బాధ్యత మీడియాపై ఉంటుంది. అలాంటి మీడియాపై అక్రమ కేసులు బనాయించే విష సంస్కృతికి కూటమి ప్రభుత్వం తెరతీసింది. పత్రికా స్వేచ్ఛను హరించడం అంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. కేసులు నమోదు చేయడాన్ని మేధావులు, ప్రజాసంఘాలు అందరూ ఖండించాలి.

– తెల్లం బాలరాజు, పోలవరం మాజీ ఎమ్మెల్యే

న్యూస్‌రీల్

సోమేశ్వరుడిని తాకిన సూర్యకిరణాలు


సోమేశ్వరస్వామిని తాకిన సూర్యకిరణాలు

భీమవరం (ప్రకాశంచౌక్): పంచారామ క్షేత్రం భీమవరం గునుపూడిలోని ఉమాసోమేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని శనివారం సూర్యకిరణాలు తాకాయి. భక్తులు ఈ దృశ్యాన్ని వీక్షించి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

15 నుంచి పశువులకు గాలికుంటు టీకాలు


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పశువులకు గాలికుంటు నివారణ టీకా కార్యక్రమాన్ని ఈనెల 15 నుంచి వచ్చేనెల 14 వరకు నిర్వహించనున్నట్టు కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. ఈ మేరకు పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ సిబ్బంది ప్రతి గ్రామంలో ఉచిత టీకాలు వేస్తారని, పశు యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ పశువుల్లో గాలికుంటు వ్యాధి సోకితే పాల ఉత్పత్తి, పని సామర్థ్యం గణనీయంగా తగ్గుతుందన్నారు. వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు, సీపీఓ కె.శ్రీనివాసరావు ఉన్నారు.

జిల్లాలో 469 మి.మీ. వర్షపాతం
నరసాపురం/భీమవరం: జిల్లాలో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. శనివారం జిల్లాలో 469 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గణపవరం మండలంలో 92.6 మి.మీ., అత్యల్పంగా ఆకివీడు మండలంలో 1.4 మి.మీ వర్షం కురిసింది. మండలాల వారీగా తాడేపల్లిగూడెంలో 31.4 మి.మీ., పెంటపాడులో 23.4, తణుకులో 13.4, అత్తిలిలో 70.2, ఉండిలో 7.2, పాలకోడేరులో 12.0, పెనుమంట్రలో 30.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇరగవరంలో 31.2 మి.మీ., పెనుగొండలో 2.4, ఆచంటలో 19.4, పోడూరులో 15.2, వీరవాసరంలో 36.0, భీమవరంలో 7.2, కాళ్లలో 1.6, మొగల్తూరులో 5.4, నరసాపురంలో 14.8, పాలకొల్లులో 20.2, యలమంచిలిలో 33.4 మి.మీ వర్షం కురిసింది.

మహిళల ఆరోగ్య రక్షణకు చర్యలు
భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో మహిళల ఆరోగ్య పరిరక్షణకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో స్వస్థ నారి శసక్త పరివార్ అభియాన్ కార్యక్రమంపై (ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబం) అధికారులతో కన్వర్జెన్సీ సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 17 నుంచి వచ్చేనెల 2 వరకు జిల్లాలో కార్యాక్రమాలు నిర్వహించేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని డీఎంహెచ్ఓ జి.గీతాబాయిని ఆదేశించారు. డీసీహెచ్ఎస్ పి.సూర్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డీఈఓ ఈ.నారాయణ పాల్గొన్నారు.

ఆకివీడు తహసీల్దార్‌పై రాజకీయ వేటు
ఆకివీడు: ఆకివీడు తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావుపై రాజకీయ వేటు పడింది. ఆయన్ను బదిలీ చేస్తూ కలెక్టరేట్‌కు అటాచ్ చేశారు. కొన్నిరోజులుగా ఆకివీడులో జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో బదిలీ జరిగినట్టు భావిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలన నుంచి ఆయన ఆకివీడులో తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు.

పెరుగుతున్న గోదావరి వరద
పోలవరం రూరల్: అల్పపీడన ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి వరద మరలా పెరుగుతోంది. భద్రాచలం వద్ద 33.40 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 29.900 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. స్పిల్‌వే 48 గేట్ల నుంచి 4.68 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు చేరుతోంది. దిగువన వరద ప్రవాహం పెరుగుతోంది.

ఈ సారైనా.. ప్రాధాన్యం దక్కేనా..?

కొనుగోలు కష్టాలు తీరేనా.!
- జిల్లాలో 2.08 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు
- 5.84 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి అంచనా
- 5 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- గత సీజన్‌లో సంచుల కొరత, సకాలంలో చెల్లింపులు జరగక రైతుల అవస్థలు
- ఈసారైనా సమస్యలు లేకుండా చూడాలని వేడుకోలు



గత రబీ సీజన్‌లో సంచులు లేక మార్టేరు-పెనుమంట్ర రోడ్డులో నిల్వ చేసిన ధాన్యం రాశులు (ఫైల్)

సాక్షి, భీమవరం: ఖరీఫ్‌లో ధాన్యం సేకరణకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. జిల్లాలో 5 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్టు సివిల్ సప్లయిస్ శాఖ ప్రకటించింది. గత రబీ సీజన్‌లో గోనె సంచుల కొరత, చివరిలో ధాన్యం సొమ్ముల చెల్లింపుల్లో తీవ్ర జాప్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. గత అనుభవాల దృష్ట్యా ఈ సీజన్‌లో సమస్యలు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

వచ్చేనెలలో కోతలు

జిల్లాలో 2.08 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగవుతోంది. ముందుగా నాట్లు జరిగిన తాడేపల్లిగూడెం ఏరియాలో అక్టోబర్ నెలలో వరి కోతలు మొదలు కానున్నాయి. జిల్లావ్యాప్తంగా 5.80 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా కాగా 5 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించారు. వరి కామన్ వెరైటీ క్వింటాల్‌కు రూ.2,369, ఏ గ్రేడ్ రకాలకు రూ.2,389లకు కొనుగోలు చేయనున్నారు. ధాన్యం మార్కెట్‌లోకి రావడానికి నాలుగైదు రోజుల ముందే కొనుగోలు కేంద్రాలు తెరవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో అధికారులను సూచించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన 48 గంటలలోపే చెల్లింపులు చేస్తామని చెప్పారు. గోనె సంచులు, రవాణా వాహనాల విషయంలో గత రబీలో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా ముందస్తు కార్యాచరణతో సంసిద్ధం కావాలని ఆదేశించారు.

'వరి'దుడుకులు తప్పేనా.. గత రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు సేకరణ లక్ష్యం మొదలు, సొమ్ములు చేతికందే వరకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. జిల్లాలోని 2.2 లక్షల ఎకరాల్లో దాళ్వా సాగు చేయగా 9.25 లక్షల టన్నులు దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఓపెన్ మార్కెట్‌లో విక్రయాలు, నిల్వ నిమిత్తం 1.50 లక్షల టన్నులు మినహాయించగా, 7.75 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు సిఫార్సు చేసింది. కాగా 6 లక్షల టన్నుల సేకరణకు మాత్రమే తొలుత ప్రభుత్వం సివిల్ సప్లయిస్ అధికారులకు ఆదేశాలిచ్చింది. రైతుల నుంచి నిరసనలు వ్యక్తం కావడంతో తర్వాత మరో 1.5 లక్షల టన్నులు సేకరించేందుకు అనుమతినిచ్చింది.

సంచుల కొరత

గత సీజన్‌లో జిల్లాలో మాసూళ్లు ముమ్మరమైన సమయంలో ఆచంట, పాలకొల్లు, తణుకు నియోజకవర్గాల్లోని పలుచోట్ల గోనె సంచుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆరిపోయిన ధాన్యాన్ని సంచులు లేక మిల్లులకు తరలించలేక వారం రోజులపైనే రోడ్ల పక్కన, కళ్లాల్లోనే ఉంచేసిన రైతులు ఎందరో ఉన్నారు. ప్రతికూల వాతావరణంతో ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు ఉరుకులు పరుగులు పెట్టేవారు. చిరిగిపోయిన, చీకిపోయిన సంచులతో ఇబ్బందులు పడేవారు.

సకాలంలో జరగని చెల్లింపులు

ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే చెల్లింపులు చేస్తామని ప్రభుత్వం చెబుతుండగా గత సీజన్ చివరిలో అందుకు భిన్నమైన పరిస్థితులను రైతులు ఎదుర్కొన్నారు. జిల్లాలో దాదాపు 77 వేల మంది రైతుల నుంచి రూ.1,650 కోట్ల విలువైన 7.17 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. వీటిలో రూ.1,360 కోట్లు రైతుల ఖాతాలకు జమచేసింది. సుమారు 18 వేల మంది రైతులకు రూ.290 కోట్ల మేర నెలన్నర రోజుల వరకూ చెల్లింపులు చేయకపోవడంతో తీవ్ర అగచాట్లు పడ్డారు. సకాలంలో ధాన్యం సొమ్ములు అందక తొలకరికి పెట్టుబడులు పెట్టేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు.

ఇబ్బంది లేకుండా చూడాలి

నాలుగు ఎకరాలు సాగు చేస్తున్నాను. మొన్న దాళ్వాలో ఏప్రిల్ నెలాఖరు నాటికి ధాన్యం తొలితే సుమారు రెండు నెలలు ఆలస్యంగా డబ్బులు పడ్డాయి. దీని వలన సార్వా పెట్టుబడులు పెట్టేందుకు ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఈసారి సమస్య లేకుండా సకాలంలో చెల్లించాలి.

– కె.ఆంజనేయులు, మేడపాడు

లోక్ అదాలత్‌తో సమయం ఆదా



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

ఏలూరు (టూటౌన్): లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంతో సమయం, డబ్బు ఆదా అవుతాయని, సామరస్యంగా కేసుల పరిష్కారమే జాతీయ లోక్ అదాలత్ లక్ష్యమని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి అన్నారు. శనివారం జిల్లా కోర్టులో నిర్వహించిన 3వ జాతీయ లోక్ అదాలత్‌ను ఆమె ప్రారంభించారు. ఇరుపక్షాల అంగీకారంతో సామరస్య వాతావరణంలో కేసులు పరిష్కారమే లక్ష్యమన్నారు. ఇప్పటివరకు 3,161 పెండింగ్ కేసులు పరిష్కరించామని, వాహన ప్రమాద బీమా కేసులకు సంబంధించి రూ.1.20 కోట్లు పరిహారంగా అందించామన్నారు. 121 ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కరించామన్నారు. రెండో అదనపు జిల్లా జడ్జి ఇందిరా ప్రియదర్శిని, 5వ అదనపు జిల్లా జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ, 8వ అదనపు జిల్లా జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

3,281 కేసుల పరిష్కారం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 3,281 కేసులు పరిష్కరించినట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. రాత్రి 8 గంటల వరకు అందిన లెక్కల ప్రకారం సివిల్ కేసులు 149, ఎంవీఓపీ కేసులు 120, క్రిమినల్ కేసులు 3,012 పరిష్కరించారన్నారు.

రెవెన్యూలో ప్రైవేట్ పెత్తనం





నూజివీడులో తహసీల్దార్ కార్యాలయం, చాట్రాయి తహసీల్దార్ కార్యాలయంలో ఆన్‌లైన్ వర్క్ చేస్తున్న ప్రైవేట్ వ్యక్తి

- ప్రైవేటు వ్యక్తుల ప్రవేశం
- సర్వేలు, విచారణల్లో వారిదే హవా
- ప్రతి పనికీ ఓ రేటు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తుల పెత్తనం, దళారుల దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. వరుసగా తహసీల్దార్లు సస్పెన్షన్లకు గురైనా, రిటైరైన తహసీల్దార్ల నుంచి రికవరీలు విధించినా ఆయా సమస్యలపై జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూవివాదాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో రెవెన్యూ శాఖ కీలకం. దీనిని ఆసరాగా తీసుకుని నూజివీడు డివిజన్‌లోని ఒక్కో రెవెన్యూ కార్యాలయంలో ఒక్కోరకంగా ప్రైవేటు వ్యక్తులు రంగప్రవేశం చేసి ప్రజలను దోచుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

చేతులు తడిపితేనే పనులు

నూజివీడు, ముసునూరు, చాట్రాయి రెవెన్యూ కార్యాలయాల్లో ద్వితీయ శ్రేణి అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు ప్రైవేటు వ్యక్తులతో చేతులు కలిపి భూ సమస్యల ఆన్‌లైన్ వ్యవహారాల్లో తమ చేతులు తడిపిన వారి పనులు మాత్రమే చక్కబెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, పట్టాదారు పాస్ పుస్తకాల జారీ సంబంధిత విచారణకు సైతం ప్రైవేటు వ్యక్తులే హాజరవుతున్నారని ప్రజలు అంటున్నారు. ఇదే తరహా వ్యవహారాలపై ఇటీవల చాట్రాయి తహసీల్దార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఇంత జరుగుతున్నా ఈ విషయాలను జిల్లా ఉన్నతాధికారులకు తెలియకుండా గోప్యంగా ఉంచడం శోచనీయం. ఓ ప్రైవేటు వ్యక్తి రాజకీయ నేతల అండదండలతో ఐదారేళ్లుగా నూజివీడు తహసీల్దార్ కార్యాలయంలోనే తిష్టవేసి అక్రమాలు చేస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

రాజకీయ నేతల అండదండలతో..

ముసునూరు మండల పరిధిలో ఐదేళ్లు పనిచేసిన ఓ గ్రామ స్థాయి అధికారి వేరే మండలానికి బదిలీ అయినా రిలీవ్ కాకుండా రాజకీయ నేతల అండదండలతో తిరిగి అక్కడే కొనసాగుతుండటంపై తీవ్ర విమర్శలు చెలరేగాయి. దీంతో ఇటీవల జరిగిన జిల్లా రెవెన్యూ అధికారుల సమీక్షా సమావేశంలో కలెక్టర్ సైతం ఆగ్రహిస్తూ తహసీల్దార్‌ను వివరణ కోరి, తక్షణం రిలీవ్ చేయమని ఆదేశించినట్టు సమాచారం.

ముక్కుపిండి మరీ వసూళ్లు

చాట్రాయి మండలానికి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించకపోవడంతో ద్వితీయ శ్రేణి అధికారి ప్రైవేటు వ్యక్తితో చేతులు కలిపి చక్రం తిప్పుతున్నారు. ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి ముక్కుపిండి మరీ వసూళ్లు చేయిస్తూ, విచారణలకు సైతం ప్రైవేటు వ్యక్తినే వినియోగిస్తుండటంపై ఆరోపణలు తీవ్రమయ్యాయి. దీంతో సాధారణ ప్రజలు తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా నూజివీడు సబ్ కలెక్టర్, కలెక్టర్ ఆయా విషయాలపై దృష్టి సారించి, డివిజన్‌లోని తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తుల ద్వారా జరుగుతున్న దందాలు, వసూళ్లు, అక్రమాలు, దళారీ వ్యవస్థలకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

భీమవరం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా వేదికగా దసరా బిగ్ సేల్ ఆఫర్లు అంటూ సైబర్ నేరగాళ్ల ప్రచారాలకు మోసపోవద్దని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. సైబర్ నేరగాళ్లు వివిధ పద్ధతులను ఉపయోగించి ప్రజలను మోసగిస్తున్నారని, ముఖ్యంగా ఫోన్ కాల్స్, ఎస్ఎంఎస్, సోషల్ మీడియా వేదికల ద్వారా ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని చెప్పారు. దసరా బిగ్ సేల్ పేరుతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లలో నకిలీ ప్రకటనలు ఇస్తున్నారని, తక్కువ ధరకే కారు, సెల్‌ఫోన్, వస్తువులు వంటివి ఇస్తామంటూ ప్రజలను ఆకర్షించడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అపరిచితుల మాయమాటలను నమ్మి వారు పంపించే లింకులను క్లిక్ చేస్తే బ్యాంక్ ఖాతాలోని సొమ్ములు మాయమవుతాయని ఎస్పీ హెచ్చరించారు. మోసగాళ్లు డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నారని జాగ్రత్తగా ఉండాలన్నారు. కేవైసీ అప్‌డేట్ పేరుతో మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అపరిచిత నంబర్ల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, ఎస్ఎంఎస్‌లకు స్పందించవద్దని, సైబర్ నేరానికి గురైతే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం కృషి చేస్తోందని, ప్రజలు సహకరించాలని కోరారు.



నయీం అస్మి, ఎస్పీ

ఉప్పొంగిన కొండ వాగులు

స్తంభించిన రాకపోకలు



బుట్టాయగూడెం: కేఆర్‌పురం సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న తూర్పువాగు

బుట్టాయగూడెం: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా పశ్చిమ ఏజెన్సీలో శనివారం మధ్యాహ్నం దాదాపు 3 గంటల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో కొండవాగులు ఉప్పొంగి ప్రవహించాయి. కేఆర్‌పురం సమీపంలోని కొండ వాగు ఉధృతితో పోలవరం నుంచి కన్నాపురం వచ్చే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే బైనేరు వాగు, కొవ్వాడ వాగు, చింతకొండ వాగు, జల్లేరు వాగుతోపాటు పలు కొండ వాగులు ఉధృతంగా ప్రవహించాయి. ఆ సమయంలో సుమారు 4 గంటల పాటు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. కొండ ప్రాంతంలో వర్షాలు కురుస్తూనే ఉండటంతో వాగుల ప్రవాహం కొనసాగుతూనే ఉంది. అల్లికాల్వ-1, 2 తోపాటు వీరన్నపాలెం గ్రామ సమీపంలోని కాల్వ కూడా పొంగిపొర్లింది. గుబ్బల మంగమ్మ గుడికి వెళ్లే మార్గంలోని కాల్వతో పాటు వేపులపాడు సమీపంలో ఉన్న కాల్వ, బూరుగువాడ సమీపంలో ఉన్న కాల్వలు పొంగిపొర్లాయి. ముంజులూరు సమీపంలోని జారుడు కాల్వ, పీఆర్ గూడెం సమీపంలోని దాటు కాల్వ, బండ్రేవి కాల్వ, చింతపల్లి కాల్వ తదితర కాల్వలు ఉప్పొంగాయి. గుబ్బల మంగమ్మ గుడిపై నుంచి వరద నీరు పరవళ్లు తొక్కుతూ ప్రవహించింది. కామవరం నుంచి గుడికి వెళ్లే మార్గంలో కొండ వాగులు ఉధృతంగా ప్రవహించాయి. దీంతో గుడికి వెళ్లిన భక్తులు, గుడి అభివృద్ధి కమిటీ సభ్యులు వాగుకు ఇరువైపులా నిలిచిపోయారు. అలాగే గిరిజన గ్రామాల్లోని పలు ఇళ్లలోకి వరద నీరు చేరింది.

నీటమునిగిన ఎద్దెల వాగు

వేలేరుపాడు: వేలేరుపాడు మండలాన్ని వరద గోదావరి వణికిస్తోంది. భారీ వర్షాలకు ప్రాణహిత, ఇంద్రావతి పొంగి ప్రవహిస్తున్నాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. శనివారం రాత్రి నీటిమట్టం 33.40 అడుగులకు పెరగటంతో వేలేరుపాడు మండలంలోని ఎద్దెల వాగు నీటమునిగింది. దీంతో దిగువ ప్రాంతంలోని 18 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కోయిదా, కట్కూరు, సిద్దారం కాచారం పూసుకుంది, తాళ్లగొంది, పేరంటపల్లి, టేకుపల్లి, టేకూరు, బుర్రెడ్డిగూడెం, ఎర్రమెట్ట, ఎడవల్లి, చిట్టం రెడ్డిపాలెం, మరో ఐదు గ్రామాలకు మండల కేంద్రంతో సంబంధాలు తెగిపోయాయి.

రాకపోకలు బంద్

కొయ్యలగూడెం: కన్నాపురంలోని పడమటి, తూర్పు కాలువల కల్వర్టులపై నుంచి నీరు ప్రవహించడంతో బుట్టాయగూడెం, పోలవరం వైపు రాకపోకలు స్తంభించాయి. బుట్టాయగూడెం నుంచి వచ్చేవారు జంగారెడ్డిగూడెం వైపు, పోలవరం నుంచి వచ్చేవారు టొండపూడి, గోపాలపురం వైపు వెళుతున్నారు. కన్నాపురం-యర్రాయిగూడెం మధ్య ఇటీవల నిర్మించిన కల్వర్టు కొట్టుకుపోయింది. కన్నాపురం, బిల్లిమెల్లి గ్రామాల మధ్య రాకపోకల స్తంభించాయి. బైనేరు ఉధృతంగా ప్రవహించింది. ఎర్రకాలువ ఉధృతికి కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మధ్య ఉన్న కొన్ని గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించలేకపోయారు.

ఉధృతంగా గుంజవరం కాలువ

పోలవరం రూరల్: మండలంలోని రేపల్లెవాడ జంక్షన్ నుంచి చేగొండిపల్లి వెళ్లే దారిలో గుంజవరం కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. కాజ్‌వే పై నుంచి నీరు ప్రవహించడంతో ఏజెన్సీలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొవ్వాడ కాలువ, ఇసుక కాలువ, పేడ్రాల కాలువ, నక్కల గొయ్యి కాలువలు కూడా పొంగి ప్రవహించాయి. కొవ్వాడ కాలువ అధిక జలాలు, పట్టిసీమ అవుట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి గోదావరి నదిలోకి చేరుకున్నాయి.



కొయ్యలగూడెం: తూర్పుకాలువపై ఇలా..



బుట్టాయగూడెం: గుబ్బల మంగమ్మ గుడి మార్గంలో..



వేలేరుపాడు: నీట మునిగిన ఎద్దెల వాగు వంతెన

శ్రీవారి క్షేత్రం.. భక్తజన సంద్రం



భక్తులతో నిండిన ఉచిత ప్రసాదం క్యూలైన్లు

ద్వారకాతిరుమల: శ్రీనివాసా గోవిందా.. అనాథ రక్షక గోవిందా.. స్మరణలు మార్మోగాయి. శనివారం పెద్ద ఎత్తున భక్తులు చినవెంకన్న సన్నిధికి చేరుకున్నారు. క్షేత్ర పరిసరాలు భక్తజన సంద్రమయ్యాయి. ఎటు చూసినా భక్తులే.. ఏ నోట విన్నా గోవింద నామస్మరణలే వినిపించాయి. దర్శనం క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. స్వామివారి దర్శనానంతరం భక్తులు ఉచిత ప్రసాదాన్ని స్వీకరించారు. దీంతో ప్రసాద వితరణ క్యూలైన్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు, అనివేటి మండపం, పరిసర ప్రాంతాలు భక్తులతో నిండిపోయాయి. సెల్‌ఫోన్‌లు భద్రపరిచేందుకు కౌంటర్ వద్ద భక్తులు క్యూ కట్టారు. మొక్కులు చెల్లించే యాత్రికులతో కల్యాణ కట్ట కిక్కిరిసింది. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

క్లుప్తంగా

పత్రికా స్వేచ్ఛను హరించడమే



భీమవరంలో దళిత ఐక్యవేదిక సమావేశంలో మాట్లాడుతున్న సుందరకుమార్

భీమవరం: సాక్షి దినపత్రికపై ఉద్దేశ్య పూర్వకంగా కేసులు పెట్టడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ అన్నారు. భీమవరం పట్టణం ప్రకాశంచౌక్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన ఐక్య వేదిక ముఖ్యనాయకులు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల పక్షాన ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను సాక్షి పత్రికలో ప్రచురించడాన్ని జీర్ణించుకోలేని కూటమి ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తోందని దీనిలో భాగంగానే సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై కేసులు పెట్టారని దీనికి దళిత ఐక్యవేదిక తీవ్రంగా ఖండిస్తునట్లు చెప్పారు. ఈ సమావేశంలో గొల్ల రాజ్‌కుమార్, ఆలమూరి బాబ్జి, తుళ్లూరి చంటి, పట్టెం శుభాకర్ తదితరులు పాల్గొన్నారు.

16, 17 తేదీల్లో క్రీడా జట్ల ఎంపికలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 16, 17 తేదీల్లో ఏలూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అండర్-14, అండర్-17 బాలబాలికల క్రీడా జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కే అలివేలు మంగ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఈ నెల 16న అండర్-17 బాలబాలికల వెయిట్ లిఫ్టింగ్ జట్ల ఎంపిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరుగుతుందన్నారు. అండర్-14, 17 బాలబాలికల స్విమ్మింగ్ జట్ల ఎంపికలు అల్లూరి సీతారామ రాజు స్విమ్మింగ్ పూల్‌లో, అండర్-14, 17 కరాటే జట్ల ఎంపికలు స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్ ప్రాంగణంలో జరుగుతాయన్నారు. అండర్-14 జట్లకు వచ్చే విద్యార్థులు 2012 జనవరి 1న కానీ ఆ తరువాత కానీ పుట్టి ఉండాలన్నారు. అండర్-17 జట్ల ఎంపికకు 2009 జనవరి 1న కానీ ఆ తరువాత పుట్టి ఉండాలన్నారు. ఇతర వివరాలకు 9030894311 నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

ఉచితం.. అవస్థల ప్రయాణం!

- ద్వారకాతిరుమల క్షేత్రంలో యాత్రికులకు ప్రయాణ కష్టాలు
- చాలీచాలని బస్సులు.. భక్తుల కొట్లాటలు
- ఉచిత బస్సుల్లో రద్దీ ఇబ్బందులు
- బస్సుల ద్వారాల వద్ద నిలబడి ప్రమాదకర ప్రయాణాలు



ద్వారకాతిరుమలలో యాత్రికులతో నిండిపోయిన ఆర్టీసీ బస్టాండ్

ద్వారకాతిరుమల: ఓ వైపు చాలీచాలని బస్సులు.. మరో వైపు ఇళ్లకు చేరుకోవాల్సిన భక్తులు.. ఏం చేయాలో పాలుపోక వృద్ధులు, చంటి పిల్లలు, దివ్యాంగులతో బస్టాండ్‌లో గంటల తరబడి పడిగాపులు.. ఇదీ ద్వారకాతిరుమలలోని శ్రీవారి భక్తుల దీన స్థితి. ఈ దుస్థితికి ఉచిత బస్సు ప్రయాణాలే కారణమని కొందరు మహిళా భక్తులు ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. చిన్న తిరుపతి క్షేత్రాన్ని శనివారం వేలాది మంది భక్తులు దర్శించారు. అనంతరం తిరిగి బస్సుల్లో స్వగ్రామాలకు చేరుకునేందుకు వారంతా బస్టాండ్‌కు చేరుకున్నారు. భక్తుల రద్దీకి సరిపడా బస్సులు లేకపోవడంతో బస్టాండ్ మొత్తం యాత్రికులతో నిండిపోయింది. దానికి తోడు మధ్యాహ్నం వర్షం కురవడంతో నిలవడానికి చోటు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.



బస్సు ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణిస్తూ..



బస్సుల వద్దకు పరుగులు తీస్తున్న యాత్రికులు



చిన్నారిని కిటికీలో నుంచి బస్సు ఎక్కిస్తున్న భక్తురాలు



రెండు బస్సుల మధ్య కిక్కిరిసి తోసుకుంటూ బస్సు ఎక్కుతున్న యాత్రికులు

బస్సులే లేవు.. ఉచిత బస్సు ఏమిటి?

ఉచిత బస్సు ప్రయాణం వల్లే ఇబ్బందులు ఏర్పడ్డాయని మహిళా భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము గతంలో శ్రీవారి దర్శనానికి వచ్చినప్పుడు తిరుగు ప్రయాణంలో ఇన్ని ఇబ్బందులు ఎప్పుడూ పడలేదని, ప్రస్తుత పరిస్థితికి ఉచిత ప్రయాణాలే కారణమని అన్నారు. బస్సులు తక్కువగా వస్తుండటంతో, వచ్చిన వాటిలో సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఎక్కుతున్నారని, దీంతో అవి పక్కకు ఒరిగిపోతున్నాయని విమర్శించారు. గుడి సెంటర్‌లో బస్సులు ఆపకపోవడం వల్ల బస్టాండుకు వచ్చామని, కానీ ఇక్కడ అసలు నిలబడడానికి కూడా దారిలేదని వాపోయారు.

తోపులాటలు.. కొట్లాటలు

బస్సు ఎక్కే సమయంలో యాత్రికులు తోపులాటకు దిగి ఒకానొక దశలో కొట్లాటలకు దిగారు. దీంతో బస్టాండ్‌లో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు బస్టాండ్‌లో ఇదే పరిస్థితి కొనసాగింది. సమాచారం అందుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి యాత్రికులను నియంత్రించే ప్రయత్నం చేశారు. పోలీసులను సైతం లెక్కచేయలేదు. దాదాపు అన్ని బస్సుల్లోనూ ద్వారాల వద్ద నిలబడే యాత్రికులు ప్రయాణాలు సాగించారు. ఈ ప్రమాదకర ప్రయాణాలు తోటి యాత్రికులను ఆందోళనకు గురిచేశాయి.

పునరుద్ధరించని బస్సు సర్వీసులు

భీమవరం, నరసాపురం ఆర్టీసీ డిపోలు ద్వారకాతిరుమలకు పలు బస్సు సర్వీసులను రద్దు చేశాయి. దానికి తోడు చాలీచాలని బస్సుల కారణంగా యాత్రికులు పడుతున్న ఇబ్బందులపై సాక్షి దినపత్రికలో గతనెల 31న ఉచిత బస్సు.. ప్రయాణం తుస్సు శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఏలూరు ప్రజారవాణా శాఖ అధికారి ఎస్‌కే షబ్నం భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులను పెంచుతామని, రద్దయిన సర్వీసులను త్వరలో పునరుద్ధరిస్తామని తెలిపారు. కానీ ఇప్పటి వరకు అవి అమలు కాలేదు.

ఇంత దారుణమా..



ప్రముఖ క్షేత్రంలో బస్సుల కోసం ఇన్ని ఇబ్బందులు పడాలా? మరీ ఇంత దారుణంగా ఉంటుందని అనుకోలేదు. రెండు గంటల నుంచి రాజమండ్రి బస్సు కోసం బస్టాండ్‌లో వేచి ఉన్నాం. కనీసం భీమడోలు వరకు అయినా వెళదామంటే బస్సు ఎక్కడానికి వీలు లేకుండా ఉంది.

– కుడిపూడి సత్యనారాయణ, భక్తుడు, రాజమహేంద్రవరం

బస్సు సర్వీసులు పెంచాలి కదా?



శనివారం భక్తులు ఎక్కువగా ఉంటారని ఆర్టీసీ అధికారులకు తెలియదా? రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు బస్సు సర్వీసులను పెంచాలి కదా. గంటకో బస్సు వస్తోంది. అది ఎక్కేందుకు వందల మంది పోటీ పడుతున్నారు. క్షేత్రంలో ఇలాంటి ఇబ్బందులు ఎప్పుడూ ఎదుర్కోలేదు.

– వేగి వీరమ్మ, భక్తురాలు, పాలకొల్లు

ఉచిత బస్సు పథకం ఎందుకు?



బస్సులు నడపలేనప్పుడు ఉచిత బస్సు పథకం ఎందుకు పెట్టారు? మహిళలను ఇబ్బంది పెట్టడానికా? శ్రీవారి దర్శనార్థం యానాం నుంచి వచ్చాం. తిరిగి వెళ్లేందుకు బస్సులు లేవు. పిల్లలు, దివ్యాంగులు, వృద్ధులతో ఎన్నో కష్టాలు పడుతున్నాం. ఉచిత బస్సులను తీసేసి, పూర్తి స్థాయిలో బస్సులను నడపండి.

– జిత్తుగ శ్రీదేవి, భక్తురాలు, యానాం

బస్సు ఎలా ఎక్కాలి?



నేను దివ్యాంగుడిని. నా తల్లి సాయంతో వచ్చి శ్రీవారిని దర్శించుకున్నాను. బస్టాండుకు వస్తే జనంతో నిండిపోయింది. నాలాంటి వారు బస్సు ఎలా ఎక్కాలి?

– ప్రవీణ్‌కుమార్, దివ్యాంగ భక్తుడు, ఉయ్యూరు

ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన ఆటో

పాలకోడేరు: పాలకోడేరు మండలం మోగల్లు రోడ్డు గోస్తనీ డ్రెయిన్ వంతెన వద్ద శనివారం ఆర్టీసీ బస్సును ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రక్ ఆటో డ్రైవర్‌కు గాయాలు కాగా.. ఆర్టీసీ బస్సు కాలువ వైపు ఒరిగింది. దీంతో బస్సులో ప్రయాణికులు బెంబేలెత్తిపోయారు. బస్సు నుంచి అత్యవసర మార్గం ద్వారా బయటకు వచ్చారు. తణుకు డిపో బస్సు భీమవరం వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.



గోస్తని డ్రెయిన్ వద్ద ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

బియ్యం ధరల మోత

- రైస్ మిల్లర్లు, వ్యాపారుల ఇష్టారాజ్యం
- నెల రోజుల్లో క్వింటాల్‌కు రూ.1000 పెరుగుదల
- మరోవైపు 26, 30 కేజీల ప్యాక్‌లతో పన్ను ఎగనామం





పాలకొల్లు సెంట్రల్: బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయి. ఆగస్టు మొదటి వారం నుంచి క్వింటాల్‌కు ఒక్క నెలలో ఏకంగా రూ.1000 రూపాయలు ధర పెరిగింది. ధాన్యం దొరకడం లేదని రైస్ మిల్లర్లు, బ్రాండెడ్ బియ్యం అమ్మే వ్యాపారులు సాకుగా చెబుతున్నారు. అయితే బియ్యం ధరలు కావాలనే పెంచుతున్నారని విమర్శలు వస్తున్నాయి. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో లేని విధంగా రైస్‌మిల్లర్లు, ట్రేడర్లు ఇష్టానుసారం ధరలు పెంచేసి ప్రజల అవసరాన్ని అవకాశంగా మలుచుకుంటున్నారు.

భగ్గుమంటున్న బ్రాండెడ్ ధర

మార్కెట్‌లో సోనా, హెచ్ఎంటీ, ఆర్ఎస్ఆర్ సోనా రకాల్ని ఆగస్టు మొదటి వారం నుంచి బ్రాండెడ్ కంపెనీలు క్వింటాల్ రూ.4000 నుంచి రూ.4200 వరకూ విక్రయించారు. ఆగస్టు 23 నాటికి బ్రాండెడ్ కంపెనీలు రూ.4,800, అన్‌బ్రాండెడ్ రూ.4,250కి అమ్మారు. సెప్టెంబర్ 1 నాటికి బ్రాండెడ్ బియ్యం టన్ను రూ.5,000, అన్ బ్రాండెడ్ రూ.4,350, సెప్టెంబర్ 8కి బ్రాండెడ్ రూ.5,200, అన్ బ్రాండెడ్ రూ.4,650కి అమ్ముతున్నారు. ఒక్క నెలలో క్వింటాల్ సుమారు రూ.1000 వరకూ పెరిగింది. దీన్ని బట్టి రైస్‌మిల్లర్లు, వ్యాపారులు ఎంత ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతుంది. ముందు ముందు ధరలు పెరుగుతాయోనని వినియోగదారులు, మార్కెట్ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

బియ్యం ధరలు నియంత్రించాలి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 380 మంది వరకూ రైస్‌మిల్లులు ఉన్నారు. వీరిలో కొందరు మాత్రమే ప్రైవేటు వ్యాపారం చేస్తుంటారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, మిర్యాలగూడ, ఖమ్మం, కోదాడ, నెల్లూరు, కర్ణాటక, బళ్లారి, సిరిగుప్పల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో బియ్యం ప్రైవేటు వ్యాపారాలు చేస్తుంటారు. మన ప్రాంతంలో 90 శాతం తూర్పుగోదావరి జిల్లా మండపేట, గొల్లప్రోలు, పెద్దాపురం ప్రాంతాల నుంచి బ్రాండెడ్ బియ్యం సరఫరా చేస్తున్నారు. అధిక ధరలపై వినియోగదారులు స్థానిక వ్యాపారులను ప్రశ్నిస్తున్నా తాము ఏం చేయలేమని రైస్ మిల్లర్లు, ట్రేడర్లు పెంచుతున్న ధరలకు తమ మెయింటెనెన్స్ నిమిత్తం రూ.50 నుంచి రూ.100 వరకూ వేసుకుని విక్రయిస్తున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆకాశాన్ని అంటుతున్న బియ్యం ధరలను నియంత్రించేలా చర్యలు చేపట్టాలని వినియోగదారులు, మార్కెట్ వర్గాలు కోరుతున్నాయి.

పన్నుకు టోకరా

గతంలో కొందరు రైస్ మిల్లర్లు, ట్రేడర్లు ప్రభుత్వానికి తెలివిగా పన్ను చెల్లించకుండా టోకరా వేసేశారు. బ్రాండెడ్ రైస్‌కు ట్యాక్స్‌లు చెల్లించాల్సి వస్తుందని బ్రాండ్‌కు ముందు ట్యాగ్‌లైన్ తగిలించి పేరు మారినట్లు చూపి పన్నులు ఎగవేసేవారు. ఓ వ్యాపారి బియ్యం ప్యాకింగ్‌పై అంతవరకూ నాగవల్లి అని బ్రాండ్ ఉంటే పన్ను ఎగ్గొట్టడానికి దానిని పి.కె.నాగవల్లిగా మార్చి పన్ను చెల్లించకుండా వ్యాపారాన్ని కొనసాగించేవారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం బ్రాండ్‌తో సంబంధం లేకుండా కేజీ నుంచి 25 కేజీల వరకూ ప్యాకింగ్ ఉన్న ప్రతి బ్రాండ్‌కు 5 శాతం జీఎస్టీ విధించింది. దీంతో వ్యాపారులు కొత్త ఎత్తుగడతో పన్నుకు ఎగనామం పెడుతున్నారు. బియ్యం బస్తాను 25, 50 కేజీలు ప్యాకింగ్ చేసేవారు. తరువాత 5, 10, 25 కేజీలుగా ప్యాకింగ్‌లు చేస్తూ విక్రయించేవారు. 5 శాతం పన్ను నుంచి తప్పించుకోడానికి కొంతకాలంగా 26 కేజీలు, 30 కేజీల ప్యాకింగ్‌లు చేస్తున్నారు. 25 కేజీలు ప్యాకింగ్ దాటితే పన్ను లేదు. ఒకవైపు పన్ను ఎగ్గొడుతున్నా బియ్యం ధరలు మాత్రం తగ్గించకపోవడం గమనార్హం. వీటిపై అధికారులు దృష్టి పెట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఆక్రమణలను అడ్డుకున్న అటవీ అధికారులు



ఆక్రమణదారులతో మాట్లాడుతున్న అటవీ అధికారులు

చాట్రాయి: మండలంలోని పోతనపల్లికి చెందిన గిరిజనులు శనివారం అటవీ భూములను ఆక్రమించుకునే యత్నాన్ని ఫారెస్టు అధికారులు అడ్డుకున్నారు. సుమారు 60 మంది ఉదయం అడవిలో తుప్పలు కొడుతుండగా సమాచారం అందుకున్న అధికారులు అడ్డుకోవడంతో గిరిజనులు, అధికారుల మధ్య కొద్ది సేపు వాగ్వాదం చోటు చేసుకుంది. తమ్మిలేరు వల్ల తమ భూములు కోల్పోయామని వాటికి ప్రత్యామ్నాయంగా ముంపు భూములను సాగు చేసుకుంటామని చెప్పగా తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు అధికారులు ఫారెస్టు అధికారులు జాయింట్ సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని అంతవరకు ఆక్రమణలు చేపట్టవద్దని సూచించారు. ప్రభుత్వ అనుమతి ఇస్తే వనసంరక్షణ సమితి ఏర్పాటు చేసి ఆదాయం కలిగేలా చేస్తామని ఫారెస్టు అధికారులు గిరిజనులకు చెప్పారు. అనంతరం కొంత మందిపై ఆక్రమణలు చేసినందుకు స్థానిక పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసినట్లు ఫారెస్టు అధికారి సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నల్లమాటి రాంబాబు మృతదేహం

కొయ్యలగూడెం: అచ్చుతాపురం వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై వి.చంద్రశేఖర్ వివరాల ప్రకారం.. రాజమండ్రికి చెందిన నల్లమాటి రాంబాబు (58) కొయ్యలగూడెం వ్యాపారం నిమిత్తం వచ్చి తిరిగి రాజమండ్రి వైపు వెళుతుండగా గోపాలపురం మండలం బుచ్చంపేట నుంచి కొయ్యలగూడెం వైపు బైక్‌పై తల్లితో వస్తున్న తామా శ్రీరామ్ ఢీకొట్టాడు. రాంబాబు తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. 108 సిబ్బంది చేరుకొని గాయపడిన శ్రీరామ్, అతని తల్లిని కొయ్యలగూడెం పీహెచ్‌సీకి, అక్కడ నుండి జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ కి తరలించారు.

జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

ఏలూరు రూరల్: ఈ నెల 16న ఏలూరు జిల్లా బాల బాలికల జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు చేపట్టనున్నామని ఏలూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి రంగారావు, అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. వట్లూరు సర్ సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో మధ్యాహ్నం 2 గంటలకు ఎంపిక జరుగుతుందన్నారు. 2006 జనవరి 1 తర్వాత పుట్టిన వారే పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు 99519 31133 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

బంగారు, వెండి వస్తువుల చోరీ

పెనుగొండ: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై కొప్పిశెట్టి గంగాధర్ తెలిపారు. శనివారం రాత్రి మాట్లాడుతూ పెనుగొండ ఎంఎస్ఆర్ నగర్‌లో బిక్కవోలు కేశవ రామాచార్యులు ఈ నెల 9న ఇంటికి తాళం వేసి పారుగూరు వెళ్లారని 13న వచ్చే సరికి తలుపులు, బీరువా తలుపు బద్దలు కొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. రెండు కాసుల బంగారం, 400 గ్రాముల వెండికాయిన్స్ మాయమవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నర్సాపురం రూరల్: నరసాపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రుస్తుంబాద గ్రామ సమీపంలో నరసాపురం ప్రధాన కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్సై సురేష్ తెలిపారు. శుక్రవారం గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. మృతురాలి ఒంటిపై ఎరుపు రంగు చీర, తెల్ల చుక్కల డిజైన్ గచ్చకాయ రంగు జాకెట్ ఉందన్నారు. వివరాలు తెలిస్తే 94407 96616 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

ఎరువుల దుకాణాలపై దాడులు

చింతలపూడి: విజిలెన్సు, రెవిన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు శనివారం చింతలపూడి మండలంలోని ఎరువులు షాపులను తనిఖీ చేశారు. మండలంలోని సీతానగరంలో గణేష్ ట్రేడర్స్, శ్రీ లక్ష్మి ట్రేడర్స్ షాపుల్లో తనిఖీ చేయగా రూ.15,67,650 విలువ కలిగిన 64.5 టన్నుల ఎరువులు తేడా ఉన్నట్లు గుర్తించి వాటిని సీజ్ చేశారు. షాపు యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఏఓ మురళీ కృష్ణ తెలిపారు.

నూతన పద్ధతులతో ఆక్వా రంగ అభివృద్ధి



ఆక్వా ఎక్స్‌పోలో స్టాల్స్ పరిశీలిస్తున్న మండలి చైర్మన్ మోషేన్ రాజు

కాళ్ల: రైతులు నూతన పద్ధతులను అవలంభిస్తే ఆక్వా మరింత అభివృద్ధి చెందుతుందని మండలి చైర్మన్ రాజు మోషేన్‌రాజు ఆశాభావం వ్యక్తం చేశారు. కాళ్ల మండలం పెదఅమీరం రాధాకృష్ణ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహిస్తున్న ఆక్వా ఎక్స్ ఇండియా కార్యక్రమం శనివారంతో ముగిసింది. మూడో రోజు మండలి చైర్మన్ సందర్శించారు. స్టాల్స్‌ను సందర్శించి ఆక్వా సాగుపై పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దంతులూరి వేణు రాజును ఆయన అభినందించారు. ఆక్వా రంగంలో కొత్త టెక్నాలజీని ఈ ప్రాంతానికి తీసుకురావడం శుభపరిణామం అన్నారు. ఆక్వా ఎక్స్‌పోతో ఈ ప్రాంత రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఎక్స్‌పో నిర్వహిస్తూ రైతులకు మేలు చేస్తున్న సీఈవో దంతులూరి వేణును అభినందించారు.

అలరించిన నాట్య విన్యాసాలు



నృత్య విన్యాసాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన నటరాజ నాట్య కళాకేంద్రం, కళాదీపిక నృత్య అకాడమీ, శ్రీశ్రీ కల్చరల్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో 12వ జాతీయ స్థాయి నృత్య అవార్డుల ప్రదాన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వైఎంహెచ్ఏ హాలులో ఈ కార్యక్రమం రాత్రి 10 గంటల వరకూ కొనసాగింది. 150 మంది చిన్నారులు చేసిన నృత్య విన్యాసాలు మంత్రముగ్ధులను చేశాయి. 20 మంది నృత్య గురువులకు నాట్య విదాత అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు ఎస్.రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఎంతోమంది చిన్నారులను ప్రోత్సహించడానికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాట్య గురువు వేదాంతం రాధేశ్యామ్, కళారత్న ఏ.పార్వతి రామచంద్రన్, నాట్యాచార్య డీ.హేమసుందర్ అతిథులుగా పాల్గొనగా, నటరాజ నాట్య కళాకేంద్రం నిర్వాహకురాలు ఎస్.కృష్ణవేణి కార్యక్రమాలు పర్యవేక్షించారు.

700 కిలోల బియ్యం పట్టివేత

ఏలూరు టౌన్: ఏలూరు సత్రంపాడు జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా వాహనంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించిన ఏలూరు త్రీటౌన్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. పీడీఎస్ బియ్యం రవాణా చేసే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఓమ్నీ వ్యాన్‌లో చీపురుగూడెంకు చెందిన తాళ్ళూరి నాగరాజు సుమారు 700 కిలోల పీడీఎస్ బియ్యాన్ని రవాణా చేయడం గుర్తించారు. అతనితో పాటు అదే గ్రామానికి చెందిన పాదిలపు రోహిత్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

పెనుగొండ సర్పంచ్‌కు అరుదైన గౌరవం



నక్కా శ్యామలా సోనీ శాస్త్రి.

పెనుగొండ: పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ శాస్త్రికి అరుదైన గౌరవం దక్కింది. ఢిల్లీలో భారత నాణ్యతా మండలి ఆధ్వర్యంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ సహకారంతో ఈ నెల 15న నిర్వహించబోయే సదస్సుకు ఆహ్వానం పంపారు. ఈ సదస్సులో పాల్గొనడానికి దేశవ్యాప్తంగా 75 మంది సర్పంచ్‌లను ఎంపిక చేయగా పెనుగొండ సర్పంచ్‌కు చోటు దక్కించింది. గ్రామీణాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగం, తాగునీరు, పారిశుధ్య సమస్యలకు పరిష్కారంపై సర్పంచ్‌ల అభిప్రాయాలు తీసుకోనున్నారు.

మహిళ మృతదేహం లభ్యం

భీమవరం: యనమదుర్రు డ్రెయిన్‌లోకి దూకిన మహిళ మృతదేహం లభ్యమైంది. టూటౌన్ ఎస్సై కె.రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని చినఅప్పారావు తోటకు చెందిన బరువు నాగమణి(55) కుమారుడు అప్పులు పాలవడంతో నాలుగేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి మానసిక ఆరోగ్యం దెబ్బతిన్న నాగమణికి వైద్యం చేయిస్తున్నారు. ఈనెల 8న ఇంటి నుంచి వచ్చిన ఆమె పట్టణంలోని యనమదుర్రు డ్రెయిన్ కాలిబాట వంతెన వద్ద డ్రెయిన్‌లోకి దూకింది. శనివారం నాగమణి మృతదేహం భీమవరం రూరల్ మండలం లోసరి వద్ద తేలడంతో ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై రామారావు చెప్పారు.

క్లుప్తంగా

బార్ల దరఖాస్తులకు గడువు పెంపు



ఎక్సైజ్ సీఐ ఇస్వరాజ్యలక్ష్మి

తాడేపల్లిగూడెం: పట్టణంలో నాలుగు బార్లకు దరఖాస్తులు చేసుకొనే సమయం పొడిగించినట్టు ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి శనివారం తెలిపారు. ఓపెన్ కేటగిరీలో భర్తీ కాకుండా ఉన్న నాలుగు బార్లకు దరఖాస్తు చేసుకోడానికి 14తో ముగియనున్న గడువును బ్యాంకు సెలవుల దృష్ట్యా 17వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు పొడిగించడం జరిగిందన్నారు. 18న ఈ బార్లకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లాటరీ తీస్తారన్నారు. అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వరాల వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో వరాల వేంకటేశ్వరస్వామి

అత్తిలి: మండలంలోని ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వేంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. పరిసర గ్రామాలనుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరై ఏడు ప్రదక్షిణలు చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి ఊంజల్ సేవ జరిపారు. హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

శిరీషకు అభినందనలు



గోల్డ్ మెడల్ సాధించిన శిరీషను అభినందిస్తున్న యోగా అసోసియేషన్ గురువులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇటీవల ఛత్తీస్‌ఘడ్‌లో యోగాసన భారత్ ఆధ్వర్యంలో జాతీయ యోగాసన పోటీలు నిర్వహించారు. జిల్లాకు చెందిన యోగా క్రీడాకారిణి శిరీష (భీమవరం) సీనియర్ మహిళా హ్యాండ్ బాలెన్స్ ఇండివిడ్యూవల్ యోగాసన పోటీలలో గోల్డ్ మెడల్ సాధించారు. ఈసందర్భంగా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ, జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, ఆరా ఫౌండేషన్ తరుపున గురువులు ఇంజుమూరి మాధవరావు, కరిబండి రామకృష్ణలు అభినందించారు.

కారుమూరి పరామర్శలు



మండపాకలో పుష్పరాజ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: వైఎస్సార్ సీపీ తణుకు మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్ మాతృమూర్తి మేరీ పుష్పరాజ్యం మృతికి మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. శనివారం మండపాకలోని ఆమె నివాసానికి వెళ్లి కుమారుడు ఆనంద్‌తోపాటు కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, తణుకు మండల మహిళాధ్యక్షురాలు ఉండవల్లి జానకి తదితరులు ఉన్నారు.

115 మంది రక్తదానం

తణుకు అర్బన్: తణుకులోని బుద్దాల నరసింహమూర్తి వలంటరీ బ్లడ్ బ్యాంక్ సెంటర్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 115 మంది రక్తదానం చేశారు. తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తణుకు తిరుమల ప్రాంగణంలో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. రక్తదానం చేసినవారితో పాటు బ్లడ్ బ్యాంక్ యాజమాన్యానికి సంస్థ చైర్మన్ తిరుమలరావు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ వాసవి జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో, టూటౌన్‌లోని కేఎన్ రోడ్డులో గల శ్రీవాసవి జీఎంఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు

కాళ్ల: మండలంలోని కాళ్లకూరులో ఉన్న స్వయంభూః శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 16వ తేదీ మంగళవారం నుంచి 20వ శనివారం వరకు సప్తనది జలాభిషేక పూర్వక పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ ఎం.అరుణ్ కుమార్ తెలిపారు. శనివారం దేవస్థానంలో పవిత్రోత్సవాల కరపత్రాలు ఆలయ అర్చకులతో కలిసి ఆవిష్కరించారు. ఐదు రోజుల పాటు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక నిర్వహించి, 20న శనివారం 7 పుణ్యనదుల నుంచి తెచ్చిన పవిత్రజలాలతో స్వామి వారికి జలాభిషేకం నిర్వహిస్తామన్నారు.

ఖరీఫ్ కోతలు ప్రారంభం

- ఎకరానికి 35 నుంచి 40 బస్తాల దిగుబడులు
- పంట గట్టెక్కించే పనిలో నిమగ్నమైన రైతులు
- హుటాహుటిన మిషన్లతో కోతలు



కృష్ణాపురం గ్రామంలో మిషన్లతో వరి కోతలు దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఖరీఫ్ రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. పంట చేతికి రావడంతో మెట్ట మండలమైన తాడేపల్లిగూడెంలోని ఎల్.అగ్రహారం, పుల్లాయగూడెం, కృష్ణాపురం, నీలాద్రిపురం, పట్టెంపాలెం, అప్పారావుపేట, మోదుగ గుంట తదితర గ్రామాల్లో శనివారంనుంచి ఖరీఫ్ వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఈ సీజన్‌లో దాదాపు 12 వేల హెక్టార్లలో వరి సాగు జరుగుతుంది. ప్రధానంగా పీఆర్126 రకం వరి వంగడాన్ని వేశారు. వర్షాలను, తెగుళ్ల తట్టుకునే వరి వంగడం కావడంతో ఎక్కువ మొత్తంలో రైతులు ఈ వరి వంగడం సాగు చేపట్టారు. శుక్రవారం రాత్రి నుంచే వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంది. దీంతో చేతికొచ్చిన పంట వర్షాల బారిన పడకుండా పచ్చిపైనే ధాన్యాన్ని రైతులు మిషన్లతో కోతలు ప్రారంభించారు. దీనికి తోడు శనివారం కొంతమేర తెరిపివ్వడంతో రైతాంగం వరి కోతలను వేగవంతం చేశారు. ఒక్కో రైతు ఐదేసి మిషన్లను పొలంలోకి దింపి కోతలను వేగిరపర్చారు. ఎకరానికి 35నుంచి 40 బస్తా ల దిగుబడి వస్తుందని అంచనాగా రైతులు పేర్కొన్నారు. రెండ్రోజులక్రితం 75కిలోల బస్తా రూ.1360 లకు కమీషన్ వ్యాపారులు కొనుగోలుచేయగా, అది కాస్తా శనివారం రూ.1200లకు ధర పడిపోయింది. రెండ్రోజుల వ్యవధిలో బస్తాకు రూ.160లు ధర తగ్గిందని రైతులు వాపోతున్నారు. చేసేదిలేక పంటను అయినకాడికి విక్రయించి చేతులు దులుపుకుంటున్నారు.



తాడేపల్లిగూడెం మండలంలో కోతకొచ్చిన వరి పంట



నీలాద్రిపురంలో ధాన్యాన్ని బస్తాల్లోకి ఎక్కిస్తున్న దృశ్యం

ఎకరానికి రూ.30వేలు పెట్టుబడులు



ఎకరం వరి సాగు చేయడానికి రూ.30వేలు ఖర్చవుతుంది. గత ఖరీఫ్‌లో 75 కిలోల బస్తా సుమారు రూ.1400లకు కొనుగోలు చేయగా, ఈ సీజన్‌లో శనివారం రూ.1200లకు పడిపోయింది. దీంతో పెట్టుబడులు రావడం గగనంగా మారుతుంది.

– మతుకుమిల్లి రామారావు, రైతు, కృష్ణాపురం, తాడేపల్లిగూడెం

వాతావరణం అనుకూలిస్తే రైతు గట్టెక్కినట్టే!



మరో వారం, పది రోజులు వాతావరణం అనుకూలిస్తే మెట్ట మండల గ్రామాలు దాదాపు 22 గ్రామాల్లోని వరి రైతాంగం గట్టెక్కినట్టే. లేకుంటే వర్షాలకు పంట బరువెక్కి నేలకొరిగే అవకాశం ఉంది. తద్వారా పంటను మిషన్లతో కోసే పరిస్థితి ఉండదు. కూలీలతో కోయించే పరిస్థితి వస్తుంది. అది రైతుకు మరింత భారంగా మారుతుంది.

– వెలమాటి విశ్వేశ్వరరావు, రైతు, నీలాద్రిపురం, తాడేపల్లిగూడెం

విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహిద్దాం



విశ్వకర్మ జయంతిని విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలు విడుదల

తాడేపల్లిగూడెం (టీఓసీ): సృష్టికర్త విశ్వకర్మ జయంతిని సెప్టెంబర్ 17వ తేదీన ఘనంగా నిర్వహిద్దామని ఏపీ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గురజాడ ఆనంద్ కుమార్ అన్నారు. పట్టణంలో జరిగిన సమావేశంలో విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి కరపత్రాలను విడుదల చేశారు. విశ్వకర్మ జయంతిని అనాదిగా విశ్వకర్మ వర్గీయులు పూజిస్తుంటారని చెప్పారు. ఈ జయంతిని కుల, మతాలకు అతీతంగా నిర్వహిస్తారని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా అన్ని జిల్లా కేంద్రాలలో ప్రభుత్వపరంగా జరపడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గున్నేపల్లి పుల్లాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి నరసింహమూర్తి, రాష్ట్ర స్వర్ణకార సంఘం నాయకులు రామోజీ తాతాచార్యులు, రాష్ట్ర కార్పెంటర్ సంఘం నాయకులు లక్కోజు సుబ్రహ్మణ్యం, శిల్పకారులు కొమ్మోజు బుచ్చిబాబు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

వాన తెచ్చిన తంటా



కాళ్లలో కాలువలా మారిన పల్లపు వీధి

శనివారం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలతో పాటు రాష్ట్ర రహదారి జలమయ్యమయ్యాయి. ప్రధాన రహదారితోపాటు అంతర్గత రహదారులు వర్షపు నీటితో నిండాయి. రాష్ట్ర రహదారి సైతం వర్షపు నీటితో కాలువలను చెరువులను తలపించింది. గ్రామంలో పల్లపు వీధి జలమయమైంది. - కాళ్ల



సినిమా హాల్ సెంటర్‌లో భారీ వర్షంతో వర్షపు నీటిలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

పూరి గుడిసె దహనం చేసిన వ్యక్తి అరెస్ట్



నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తోన్న ఏఎస్పీ భీమారావు

నరసాపురం: మొగల్తూరు నడిబొడ్డున ఉన్న ముత్యాలమ్మ అమ్మవారి పూరిగుడిసె ఈ నెల 9న అగ్నికి ఆహుతైన ఘటన ప్రమాదం కాదని పోలీసులు దర్యాప్తులో తేల్చారు. ఎప్పటి నుంచో ఉంటున్న పూరి గుడిసె స్థానంలో సంప్రదాయం పక్కన పెట్టి సిమెంట్ షెడ్డు నిర్మిస్తున్నారనే కోపంతో మొగల్తూరు గ్రామానికే చెందిన చేపలు అమ్ముకుని జీవించే తోట శ్రీనివాస్ అనే వ్యక్తి తగలబెట్టినట్టు నిర్ధారించారు. శనివారం నరసాపురం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ భీమారావు వివరాలు వెల్లడించారు. ముత్యాలమ్మ అమ్మవారి పూరి గుడిసె దగ్ధమైన నేపథ్యంలో సున్నితమైన ఈ అంశాన్ని పోలీసుశాఖ చాలా సీనియస్‌గా తీసుకుని దర్యాప్తు చేపట్టిందని చెప్పారు. ఏలూరు రేంజ్ ఐజీ, జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో 5 ప్రత్యేక బృందాలు ఏర్పడి దర్యాప్తు సాగించాయని చెప్పారు. సీసీ కెమెరాల ద్వారా సాగిన దర్యాప్తులో నిందితుడిని గుర్తించామన్నారు. భార్యతో విడిపోయి చేపలు అమ్ముకుంటూ, కూలి పనులు చేసుకుంటూ జీవించే శ్రీనివాస్ ముత్యాలమ్మకు భక్తుడిగా ఉంటూ తరచూ పూజల్లో పాల్గొనేవాడని చెప్పారు. అయితే ఇటీవల అమ్మవారి తాటాకు గుడిసె స్థానంలో సిమెంట్ ప్లాట్‌ఫామ్, షెడ్డు నిర్మించాలని తీసుకున్న నిర్ణయాన్ని శ్రీనివాస్ వ్యతిరేకించాడని ఏఎస్పీ వివరించారు. సంప్రదాయం చెడిపోతుందనే కోపంలో ఆవేశంతో నిప్పుపెట్టినట్టుగా నిందితుడు అంగీకరించాడని చెప్పారు. సమావేశంలో నరసాపురం డీఎస్పీ డాక్టర్ శ్రీవేద, పోలీసులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన



ఆర్ఎంపీ, పీఎంపీల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: కుష్టువ్యాధి అంటే సాధారణ అంటు వ్యాధువంటిదని అది ఒక క్రిమి కారకంగా కలిగే రోగమని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల సంఘం ఉభయ గోదావరి జిల్లాల కో–ఆర్డినేటర్ ఎం.రంగనాథరావు, జిల్లా కో–ఆర్డినేటర్ ఆలమూరి బాబ్జీ అన్నారు. భీమవరంలో శనివారం బ్రైటర్ ఫ్యూచర్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రీచ్ మీ ప్రాజెక్ట్ ద్వారా పట్టణంలోని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు కుష్టువ్యాధి, ఫైలేరియా వ్యాధులపై నిర్వహించిన ఆరోగ్య అవగాహన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. కుష్టు వ్యాధి రెండు రకాలుగా కలుగుతుందని మన దేశంలో 80 శాతం కుష్టు రోగం అంటుకాని రకానికి చెందినదేనన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు వీటిపై పూర్తి అవగాహనతో వైద్య సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్, డీఎస్ రత్నకుమార్, గొల్ల రాజ్‌కుమార్, పెట్టేం శుభాకర్, అంబటి ఆనందకుమార్, తుళ్ళూరు చంటి, సుధ, పాక రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన

వీరవాసరం: మండలంలోని రాయకుదురు హైస్కూల్‌లో జిల్లా ఈగల్ సెల్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలకు దూరంగా ఉందాం–విలువైన ప్రాణాన్ని కాపాడుకుందాం అనే అంశంపైన ప్రధానోపాధ్యాయుడు కానుకొలను శ్రీనివాసరావు అధ్యక్షతన అవగాహన కల్పించారు. ఈగల్ సెల్ కానిస్టేబుల్స్ మురళి, నాగేశ్వరావు మత్తు పదార్థాలు సేవించడం వల్ల వచ్చే లక్షణాలు, అనర్థాలు, పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల వచ్చే రోగాలు, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా డ్రైవ్ చేయడం ద్వారా జరిగే అనర్థాలపై విద్యార్థులకు వివరించారు. పాఠశాల ఈగల్ సెల్ కన్వీనర్స్ పి.గజేంద్ర గట్కర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరం

తణుకు అర్బన్: తణుకు కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు 650 కేసులు రాజీ చేశారు. మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ 23, క్రిమినల్ 605, ప్రీలిటిగేషన్ కేసులు 22 పరిష్కరించినట్లు న్యాయమూర్తులు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి డి.సత్యవతి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, చట్టాలు తెలియక చాలామంది ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా కక్షిదారులు తమ విలువైన సమయాన్ని డబ్బును ఆదా చేసుకోవచ్చని, అలాగే ఏళ్ల తరబడి పెండింగ్ ఉన్న కేసులు మీడియేషన్ ద్వారా రాజీ చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు కె.కృష్ణ సత్యలత, సాయిరాం పాత్రల్లంక, బెంచ్ మెజిస్ట్రేట్ తాడి ఆంజనేయులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



తణుకు కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.సత్యవతి



తాడేపల్లిగూడెం(టీఓసీ): లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేస్తున్న అదనపు జిల్లా జడ్జి సికిందర్ భాషా

జాతీయ లోక్ అదాలత్ విజయవంతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైనట్లు తాడేపల్లిగూడెం మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా అన్నారు. స్థానిక కోర్టు భవనాల సముదాయంలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. రూ. 1 కోటి 4 లక్షల 63 వేల 460 విలువ గల కేసులు రాజీ అయ్యాయి. సివిల్ కేసులు 16, క్రిమినల్ కేసులు 87, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు 5, ప్రీ లిటిగేషన్ కేసులు 31, బెంచ్ కోర్టు కేసులు 282 మొత్తం 421 కేసులు రాజీ చేశారు. జాతీయ లోక్ అదాలత్‌ను 5 బెంచీలుగా నిర్వహించారు. అదనపు జిల్లా జడ్జితో పాటుగా సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్య కిరణ్ శ్రీ, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.లలితా దేవి, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఈ.అన్నామణిలు పర్యవేక్షించారు. అడ్వకేట్ సభ్యులుగా దూలం విజయకుమార్, భూపాల్, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, జగదీష్‌లు వ్యవహరించారు. బార్ ప్రెసిడెంట్ శిరిగినీడి విజయకృష్ణ ఆధ్వర్యంలో కక్షిదారులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, కక్షిదారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి ఆడపిల్లల చదువు అవసరం



విజయనిర్మలను సత్కరిస్తున్న దృశ్యం

నరసాపురం: ఆడపిల్లల చదువులు సమాజాభివృద్ధికి చాలా అవసరమని ఆదికవి నన్నయ యూనివర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల అన్నారు. పట్టణంలోని శ్రీసూర్యా కళ్యాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ ఎస్‌సీహెచ్‌ఈ అకడమిక్ అడ్వైయిజర్ డాక్టర్ షేక్ సులేమాన్, కళాశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ, డిగ్రీ ప్రిన్సిపాల్ పి.పుల్లారావు, అకడమిక్ ప్రిన్సిపాల్ టి.కృష్ణగుప్తా పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్న రాష్ట్ర ప్రభుత్వ, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని, ఈ విధానాలను వ్యతిరేకిస్తూ ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం నిరసన వారం నిర్వహించారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఆయా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు, స్థానిక ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు కరువు బత్యాలను విడుదల చేయాలని, 12వ పీఆర్‌సీ ప్రకటించాలని, మధ్యంతర భృతిని 30 శాతం ప్రకటించాలని, ఈహెచ్ఎస్‌ను రూ.25 లక్షలకు పెంచాలని, ఉపాధ్యాయులకు పని భారాలను తగ్గించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ నారాయణ, సహాయ కార్యదర్శి లంకా రాజు, మండల అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, నాయకులు ఎం.చంద్రరావు, రామకృష్ణ, రాంబాబు, రామభద్రరావు, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రోత్సాహకాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాలకొల్లు సెంట్రల్: యాదవ విద్యార్థులకు విద్యా ప్రోత్సాహకాలకు ఎంపిక చేయనున్నట్లు యాదవ ఎడ్యుకేషన్ సొసైటీ (వైఈఎస్) అధ్యక్షుడు కొండ్రు శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2025లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో ఉత్తీర్ణత సాధించిన యాదవ విద్యార్థులకు తమ సంస్థ తరుపున విద్యా ప్రోత్సాహకాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ ప్రోత్సాహకానికి విద్యార్థులు ముందుగా దరఖాస్తులు చేసుకోవాలని, ఈ నెల 21న నిర్వహించనున్న యాదవ ఎడ్యుకేషన్ సొసైటీలో ప్రోత్సాహకాలు అందిస్తామని స్పష్టం చేశారు. పోత్సాహకాలు పొందిన విద్యార్థులకు వారి సెల్ నెంబర్‌కు వేదిక మెసేజ్‌లు పంపిస్తామని పేర్కొన్నారు. సమాచారం అందుకున్న విద్యార్థులు తమ తల్లిదండ్రులతోపాటు కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు.

వర్షాకాలం.. విద్యుత్ వాహకాలతో జాగ్రత్త

- విద్యుదాఘాత ప్రమాదాలు పెరుగుతున్న వైనం
- అప్రమత్తంగా ఉండకపోతే ప్రాణాపాయమే
- విద్యుత్ ప్రమాదాలపై ముందు జాగ్రత్త చర్యలు ఎక్కడ..?
- అవగాహన కల్పించలేకపోతున్న విద్యుత్ శాఖ అధికారులు



తణుకు విద్యుత్ సబ్ స్టేషన్

తణుకు అర్బన్: వర్షాకాలం కావడంతో ఒకవైపు భారీ వర్షాలు ఆపై ఈదురు గాలులతో వాతావరణ పరిస్థితులు భయాందోళనలు సృష్టిస్తున్నాయి. వర్షాలు పడుతున్నాయంటే చాలు విద్యుత్ స్తంభాలను తాకాలన్నా భయపడే పరిస్థితులు ఉంటాయి. విద్యుత్ వాహకాలపై ప్రజానీకం, విద్యుత్ వినియోగదారులు ఎంతో అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. విద్యుదాఘాతంతో అమాయక ప్రజలు అసువులు బాస్తున్న ఘటనలు నిత్యం కనిపిస్తున్నాయి. వర్షాలకు నేలకొరుగుతున్న వృక్షాలు, తెగిపడుతున్న విద్యుత్ తీగలు, విద్యుత్ స్తంభాలకు విద్యుత్ సరఫరాతో పాటు షార్ట్ సర్క్యూట్ వంటి సందర్భాలు ఉంటున్న పరిస్థితుల్లో విద్యుత్ శాఖ అధికార యంత్రాంగం సైతం అప్రమత్తమై వినియోగదారులకు ప్రమాదాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. వర్షాకాలంలో ఈదురుగాలులకు తెగిపడే విద్యుత్ తీగల కారణంగా నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. విద్యుత్ ప్రమాదం జరిగిందంటే చాలు 90 శాతం ఘటనల్లో ప్రాణాలు హరించే దుస్థితి నెలకొంది. గృహాల్లో సైతం తడిచేతులతో స్విచ్‌లు వేసిన సందర్భాల్లో కూడా ప్రాణాలు గాల్లో కలసిపోయిన ఘటనలు చూస్తున్నాం.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన ఏది?

వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ శాఖ ప్రజానీకానికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సి ఉన్నప్పటికీ, వర్షాకాలం మొదలై చాలా రోజులు గడుస్తున్నా ఇంతవరకు విద్యుత్ శాఖ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోని స్థితిలో ఉందని ప్రజానీకం ఆరోపిస్తున్నారు. విద్యుత్ ప్రమాదాలో చోటు చేసుకున్నప్పుడు హడావుడి చేసేసి తరువాత ప్రమాద నివారణపై దృష్టిసారించని విద్యుత్ శాఖ అధికారుల తీరును ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గతంలో కరపత్రాల రూపంలో విద్యుత్ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. కానీ నేడు ఆ పరిస్థితులు ఎక్కడా కనిపించడంలేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

వర్షాలు పడుతున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- భారీ వర్షాల సమయాల్లో ఇంటి గృహోపకరణాల స్విచ్‌లు ఆఫ్ చేసి ఉంచాలి.
- గృహాల్లో కరెంటు స్విచ్ బోర్డుల్లో స్విచ్‌లను తడి చేతులతో తాకరాదు.
- చిన్న పిల్లలను కరెంటు వస్తువులకు దూరంగా ఉంచాలి.
- ఇంటి సర్వీసు వైరు తెగినా, జాయింట్స్ కట్ అయినా వాటిని తాకకుండా వెంటనే విద్యుత్ శాఖకు తెలియచేయాలి.
- విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లను తాకరాదు.
- ఇంటి పరిసరాల్లో చెట్లు, కరెంటు స్తంభాలు పడిపోయిన సందర్భాల్లో దగ్గరకు వెళ్లకుండా ముందుగా విద్యుత్ శాఖకు తెలియపరచాలి.
- గృహాల ఆవరణలోని నీళ్ల మోటార్లకు ఉన్న కరెంటు వైర్లను తాకరాదు.
- గాలి, వాన వస్తున్న సమయాల్లో కరెంటు లైన్లు కింద నిలబడడం, కూర్చోవడం చేయరాదు.
- రహదారుల్లో విద్యుత్ ప్రసారం జరిగే తీగలు తెగి పడిఉంటే విద్యుత్ ప్రవాహం ఉన్నట్లుగా భావించి దూరంగా ఉండాలి.
- మోటార్ల స్టార్టర్లు, మోటార్లు వర్షం వలన నీటిలో మునగడం, పూర్తిగా తడవడం వలన షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉండడంతో రైతులు జాగ్రత్తలు పాటించాలి.
- విద్యుత్ ప్రమాదానికి గురైన వారిని కానీ ఆ విద్యుత్ పరికరాన్ని కానీ నేరుగా తాకరాదు.
- వర్షాలు పడుతున్న సమయాల్లో రహదారులపై ఉన్న విద్యుత్ స్తంభాలను ముట్టుకోరాదు.
- ట్రాన్స్‌ఫార్మర్స్ దిమ్మెలపై పోస్టర్‌లు, పెయింటింగ్‌ల కోసం వెళ్లరాదు.
- విద్యుత్ సమస్యల పరిష్కారంకోసం టోల్‌ఫ్రీ 1912 నంబరులో సంప్రదించాలి.